క్లుప్తంగా

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి



ఆకులామైలారంలో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

యాచారం: వ్యవసాయ బావులు, పొలాల వద్ద ఉంచే గొర్రెలు, మేకలు, పాడి పశువుల చోరీలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ సూచించారు. పీఎస్ పరిధిలోని ఆకులామైలారం గ్రామంలో శుక్రవారం చోరీలు, కొత్త వ్యక్తుల సంచారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాత్రి పూట గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్లే దొంగల ముఠాపై రైతులు, కాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే మందల వద్ద సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు



కుంకుమార్చనలో మహిళలు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణ వార్షికోత్సవంలో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో గణపతి పూజ, గోపూజ, పుణ్యహవాచనం, పంచగవ్య ప్రాశన చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చన, చండీ హోమం, నవగ్రహ, రుద్ర పూజలు నిర్వహించారు.

ఘనంగా తుల్జాభవాని విగ్రహ ప్రతిష్ఠ



తుల్జా భవాని దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ పూజలో నాయకులు, తండావాసులు

మాడ్గుల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ సర్పంచ్ బట్టు అనురాధ కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాజీవ్‌నగర్ తండాలో శ్రీ తుల్జా భవాని దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని భక్తి మార్గం వైపు నడవాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామ దేవతలను పూజించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఓ స్వచ్ఛంద సంస్థ శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ ఎలా సోకుతుంది. రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర అంశాలను ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, జాతీయ సేవా విభాగం అధికారులు రమేష్, రాకేష్ భవాని, రచన, ప్రాజెక్ట్ మేనేజర్ రాఘవ, కైలాష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 13న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటిచూపు మందగించిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆమనగల్లు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాషా కోరారు.



గండిమైసమ్మ దేవాలయం సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డు



జాతీయ రహదారి నుంచి కాలనీలకు వెళ్లే దారి

పనులు నిలిచి.. వెతలు పెంచి

- అర్ధంతరంగా ఆగిన జాతీయ రహదారి విస్తరణ పనులు
- భారీ వర్షాలకు కోతకు గురైన సర్వీస్ రోడ్లు
- అవస్థలు పడుతున్న కాలనీవాసులు, వాహనదారులు

అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎల్‌బీనగర్ నుంచి దండు మల్కాపూర్ వరకు విస్తరణ పనులు పూర్తి చేసినప్పటికీ అబ్దుల్లాపూర్‌మెట్ కూడలితో పాటు ఇనాంగూడ కూడలి, రామోజీ ఫిలింసిటీ మెయిన్ గేట్, గండిమైసమ్మ దేవాలయం సమీపంలో నిర్మాణ పనులను నిలిపి వేశారు. దీంతో కొన్ని నెలలుగా వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం రోడ్డు దాటేందుకు సైతం ఆపసోపాలు పడుతున్నారు. ప్రమాదాలు సంభవించి ప్రాణాలు గాల్లో కలుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి.

రాకపోకలకు అంతరాయం

ఇటీవల కురిసిన భారీ వర్షానికి మధ్యలో నిలిపివేసిన రోడ్డు నిర్మాణం కాస్త పలు చోట్ల వరద తాకిడికి వర్రెలు బారి పూర్తిగా ధ్వంసమయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు రోడ్డు నిర్మాణ పనులు ఎందుకు నిలిపి వేశారనేది ఇప్పటికీ ఎవరికీ అర్థం కావడం లేదని పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే తీవ్ర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అసంపూర్తిగా ఉన్న ప్రాంతాల్లో పటిష్టమైన నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సొంత నిధులు వెచ్చించి

వర్షం కురిసినప్పుడు అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీ, న్యూలైఫ్‌విల్లా కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు కోతకు గురవ్వడంతో స్థానికులే సొంత నిధులు వెచ్చించి మట్టి పోయించుకుంటున్నారు. అయినా అది ఎక్కువ రోజులు ఉండడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా సమస్య మళ్లీ సమస్య ఉత్పన్నం అవుతోంది. జాతీయ రహదారి అధికారులు స్పందించి రోడ్డు విస్తరణను పూర్తి చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తోంది. అధికారులకు పలుమార్లు విన్నపించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

“ ఇబ్బందులు పడుతున్నాం

వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు కోతకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్నాం. తాత్కాలికంగా మట్టి పోయించుకుంటున్నాం. జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో ఈ సమస్య మరింత జటిలమైంది. రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

– సత్యనారాయణశర్మ, ద్వారకానగర్‌కాలనీ

వైన్స్‌లకు దరఖాస్తు చేసుకోండి



ఆమనగల్లులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్

ఆమనగల్లు: మద్యం షాపుల(వైన్స్) కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ సూచించారు. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునే వారి కోసం అవగాహన కలిగేందుకు ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో మొత్తం 17 మద్యం షాపులు ఉన్నాయన్నారు. మద్యం షాపుల కోసం గత నెల 26 నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 17 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 18 లోపు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుదారులు రూ.3 లక్షలు డీడీ లేదా చలాన్ చెల్లించాలని, రిజర్వేషన్ ఉన్నట్లయితే సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఈనెల 26న లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని సీఐ వివరించారు.

పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కృష్ణా వాటర్ పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నేతలతో కలిసి కమిషనర్ సరస్వతిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణావాటర్ సంప్ ఉందని.. ఇక్కకు నీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్లకు రంధ్రాలు ఏర్పడడంతో విద్యార్థులు అక్కడ ప్లేట్లు శుభ్రం చేస్తున్నారని చెప్పారు. శుభ్రం చేసిన నీరు నేరుగా సరఫరా చేస్తున్నారని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నేతలు మురళీధర్‌రెడ్డి, కిరణ్‌రాజ్ తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పించని పాఠశాలలపై చర్యలు

మహేశ్వరం: విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి కస్నానాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కోళ్లపడకల్‌లో శ్రీరామచంద్ర విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో సరైన వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆట స్థలం, క్రీడా వస్తువులు లేవని చెప్పారు. ఇరుకైన తరగతి గదుల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్ లేవన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

యాచారం: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని 24 గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన 32 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండల విద్యాధికారి పాండురంగారెడ్డి మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల మెరుగైన విద్యబోధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాటు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పెద్ద చెరువు మురుగుమయం

ట్రంక్‌లైన్ ద్వారా నేరుగా చేరుతున్న డ్రైనేజీ నీరు

- మృత్యువాత పడుతున్న చేపపిల్లలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం




పెద్ద చెరువులో కలుస్తున్న బడంగ్‌పేట మురుగునీరు

మీర్‌పేట: ఓ వైపు సుందరీకరణ.. మరోవైపు తటాకమంతా మురుగుమయం కావడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు సుందరీకరణ కోసం ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేసింది. కొంత వరకు అభివృద్ధి చేయడంతో పాటు మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేకంగా ట్రంక్‌లైన్‌ను కూడా నిర్మించారు. దీంతో రెండేళ్లుగా చెరువులోకి దాదాపు వర్షపునీరే ఎక్కువగా చేరడంతో కాలుష్యం తగ్గుముఖం పట్టింది. మత్స్య సొసైటీ సభ్యులు సైతం చేప పిల్లలను వదిలి చేపలు పట్టడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పైనున్న అల్మాస్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల నుంచి వరదతో పాటు మురుగునీటిని కూడా చెరువులోకి వస్తోంది. 20 రోజులుగా ట్రంక్ లైన్ నుంచి నేరుగా డ్రైనేజీని మళ్లించడంతో చెరువు అంతా పూర్తిగా మురికి కూపంగా మారిపోయింది. ప్రస్తుతం తటాకం ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించడంతో వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని సమీప కాలనీలవాసులు పేర్కొంటున్నారు.

భారీ వర్షాలకు..

బడంగ్‌పేట, అల్మాస్‌గూడ ప్రాంతాల నుంచి ట్రంక్ లైన్ ద్వారా బయటకు వెళ్లాల్సిన మురుగునీరు నేరుగా చెరువులోకి కలుస్తున్నా మీర్‌పేట మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. నెల రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వర్షపునీటితో కళకళలాడిన చెరువు కొన్ని రోజుల్లోనే మురుగుమయం కావడంపై స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుందరీకరణ లక్ష్యం నీరు గారుతున్నా, చెరువులో మురుగునీరు చేరడంతో ఇటీవల చేపలు సైతం మృత్యువాత పడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

గురుకుల హాస్టల్‌ను పరిశీలించిన ఎంఈఓ



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్: చటాన్‌పల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల వసతి గృహాన్ని శుక్రవారం కేశంపేట ఎంఈఓ చంద్రశేఖర్ పరిశీలించారు. హాస్టల్ విద్యార్థి హర్షవర్ధన్ ఫినాయిల్ బాటిల్‌లో తాగునీరు సేవించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఫినాయిల్ బాటిల్‌లో వాటర్ తాగిన విషయం గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ప్రిన్సిపాల్ ప్రీతి ఎంఈఓకు వివరించారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ముద్విన్ గ్రామానికి చెందిన దాదాపు 25 మంది బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు, పేదలకు రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, నర్సింహ, బీచ్యానాయక్, రామచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, రమేశ్, నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరు



మంచాల: నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

మంచాల: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంతో శుక్రవారం మంచాల మండల కార్యాలయం వద్ద రాస్తారోకో చేసిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే తప్పేంటని ప్రశ్నించారు. కేవలం 15 శాతం ఉన్న అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఎవరూ కోర్టుకు వెళ్ల లేదన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం కచ్చితంగా 42 శాతంపైగా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినా కొంత మంది స్వార్థపరులు హైకోర్టుకు వెళ్లి అడ్డుకోవడం సమాంజసం కాదన్నారు. బీసీల నోటికాడి బువ్వను గుంజుకోవడం దారుణమన్నారు. రిజర్వేషన్ల అమలు విషయంలో రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. అందుకోసం మంచాల మండలం నుంచే కార్యాచరణ సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, బాలరాజు, కృష్ణ, లింగం, శ్రీశైలం, పాండు, యాదయ్య, ఐలయ్య, వినోద్‌కుమార్, సత్తయ్య, మల్లేష్, రాజేష్, పాండు, చంద్రయ్యగౌడ్, కె.లింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టుకు వెళ్లాలి



కడ్తాల్: జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: జీఓ నంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టును ఆశ్రయించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్ సూచించారు. బీసీ సంఘాల పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీలందరూ ఐక్యతతో హక్కుల సాధనకు పోరాడే సమయం ఆసన్నమైందన్నారు. రాజకీయంగా బీసీలను అణగదొక్కాలని ప్రయత్నించే వారు తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, లాయక్‌అలీ, సత్యంయాదవ్, రవి, నర్సింహ, రాజేశ్, రాంచందర్‌నాయక్, శేఖర్, పాండు, రమేశ్, శ్రీను, శ్రీశైలం, రాజేందర్‌గౌడ్, భానుకిరణ్, రాజు మహేశ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కొత్త కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధి విస్తరిస్తున్నందున కొత్త కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. హెచ్‌ఎండీఏ నిధుల ద్వారా రూ.10 కోట్లతో మున్సిపల్ పరిధిలోని కొత్త కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, నేతలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు

ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు



హయత్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

యాచారం: మండల పరిధిలోని గునుగల్, చౌదర్‌పల్లి, మొగుల్లవంపు, అయ్యవారిగూడెం, తక్కళ్లపల్లి తండా తదితర గ్రామాల్లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పర్యటించారు. వరి, పత్తి, కూరగాయల పంటలను పరిశీలించారు. పంటల సాగులో నాణ్యమైన విత్తనం, సస్యరక్షణ చర్యలు, యూరియా వాడకం, పురుగు మందులు వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలో యూరియా వాడితే పంటలో తాలు అధికంగా వస్తుందని తెలియజేశారు. పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడితో పాటు మంచి ఆదాయం కూడా పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నర్సయ్య, రామకృష్ణ, కిరణ్, శ్రీనివాస్, ఆంజనేయులు, కృష్ణవేణి, ఏఓ రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

హయత్‌నగర్: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నామని వ్యవసాయ శాస్త్రవేత్త సునీత, శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కొహెడలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి పంట గింజదశలో ఎలుకలు పొలంలో చేరి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు. ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. దీర్ఘకాలంగా ఒకే పంట వేయడంతో భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం పడుతుందన్నారు. అనంతరం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.



యాచారం: చౌదర్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ నిపుణులు



ఇబ్రహీంపట్నం: ముకునూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పంట పొలాల పరిశీలన

ఇబ్రహీంపట్నం: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముకునూర్ గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రజనీకాంత్, అరుణశ్రీలు కేఎన్‌ఎం 1638 వరి రకాన్ని సాగు చేసిన రైతులతో ముచ్చటించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలను శాస్త్రవేత్తలు వివరించారు. ఆలస్యంగా నాటిన వరి చెనుకు ఆకుముడుత, కంకినల్లి ఆశిస్తుందని.. దాని నివారణకు ఎసిఫేట్ 2.5 గ్రాముల ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ విద్యాధరి, గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్, ఏఈఓ సృజన, రైతులు పాల్గొన్నారు.